క్లుప్తంగా

పంచపది కవిరత్న బహూకరణ



ఎంఈఓ చంద్రమౌళి

ఎల్.ఎన్.పేట: స్థానిక ఎంఈఓ-2గా పనిచేస్తున్న కుప్పిలి చంద్రమౌళికి తెలంగాణ రాష్ట్రానికి చెందిన పంచపది కవన వేదిక 'పంచపది కవిరత్న' బిరుదును ఆదివారం బహూకరించింది. జిల్లా, రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను అందుకున్న చంద్రమౌళి తన 40 ఏళ్ల సాహితీ అనుభవంతో ఉపాధ్యాయ శిక్షకులకు, విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను రచించారు. రేడియో, మాస పత్రికల్లో అనేక కవితలు, కథలు రచించిన ఈయన గురజాడ సాహితీ పురస్కారం పొందారు. ఈయన రచనలను గుర్తించిన తెలంగాణకు చెందిన పంచపది కవన వేదిక తగిన బిరుదును అందించారు. చంద్రమౌళికి మండలంలోని పలువురు ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

హార్మోనిస్టు మృతికి సంతాపం



బాలకృష్ణమూర్తి (ఫైల్)

కొత్తూరు: మండలంలోని కుంటిభద్ర గ్రామానికి చెందిన ప్రముఖ హార్మోనిస్టు గిరడ బాలకృష్ణమూర్తి (82) అనారోగ్యంతో శ్రీకాకుళంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందారు. బాలకృష్ణమూర్తి లేనిలేటు తీర్చలేనిదని ఈ ప్రాంత కళాకారులు అన్నారు. బాలకృష్ణమూర్తి మృతిపట్ల పలువురు కళాకారులు సంతాపం వ్యక్తం చేశారు.

ఇద్దరిపై కేసు నమోదు

పొందూరు: స్థానిక కళాంజలి థియేటర్ సమీపంలో నూతనంగా దుకాణం ప్రారంభించనున్న నేపథ్యంలో వెల్డింగ్ కార్మికుడు నాని భార్యకు, దుకాణదారుడు వికాస్‌కు షట్టర్ లాక్‌ల పని విషయంలో వివాదం చోటు చేసుకుంది. షట్టర్ లాక్‌లు ఏర్పాటు చేయడం, అందుకు తగిన నగదు విషయంలో వెల్డింగ్ కార్మికుడు భార్య దుకాణదారుడితో మాట్లాడుతుండగా ఇరువురి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. వెల్డింగ్ కార్మికుడు భార్య తనపై దాడి చేసిందని వికాస్ పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేశారు. మహిళనని చూడకుండా దుకాణదారుడు అసభ్యకర పదజాలంతో దూషించి బెదిరించాడని అతనిపై ఫిర్యాదు చేశారు. ఇరువురిపై ఎస్ఐ సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తాగునీటి ట్యాంక్ శుభ్రం



ట్యాంక్‌ను శుభ్రం చేస్తున్న దృశ్యం

జలుమూరు: పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని రావిపాడు సర్పంచ్ బోర భారతి అన్నారు. ఆదివారం తాగునీటి ట్యాంక్‌ను క్లోరినేషన్ చేసి మంచినీటిని సరఫరా చేశారు. వీధులను శుభ్రం చేసి చెత్త, వ్యర్థాలు తొలగించారు. పంచాయతీ కార్యదర్శి సవర చిన్నారావు, వైఎస్సార్‌సీపీ నాయకుడు బోర సింహాచలం, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీరు అందించరూ..



పనిచేయని సోలార్ రక్షిత మంచినీటి పథకం

సారవకోట: మండలంలోని గొర్రిబంద పంచాయతీ కోనవానిపేట గిరిజన గ్రామంలో ఏర్పాటు చేసిన సోలార్ రక్షిత మంచినీటి పథకం కొన్ని నెలలుగా పనిచేయడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఐటీడీఏ ద్వారా గిరిజన గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి దీనిని ఏర్పాటు చేశారు. ఈ గ్రామంలోని రక్షిత మంచినీటి పథకం పనిచేయకపోవడంతో తాగునీటి సమస్య ఎదుర్కొంటున్నామన్నారు. బావులపై ఆధారపడాల్సి వస్తోందని, దీంతో వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బోరు బాగుచేయరూ..



పిచ్చిమొక్కల మధ్య ఉన్న బోరు

హిరమండలం: మండలంలోని గులుమూరు గ్రామంలోని శివారులో ఉన్న బోరు ఏడాది నుంచి పని చేయడంలేదు. తాగునీటి ఇక్కట్లు పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. అధికారులకు తెలియజేసినా పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిరుపయోగంగా బోరు ఉండటంతో చుట్టూ పిచ్చిమొక్కలు, పొదలు అల్లుకున్నాయన్నాయన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తక్షణమే మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

● నిరుపయోగం



సారవకోట మండలంలోని మాకువ గ్రామంలో చెత్తసేకరణ బండి మూలకు చేరింది. ఈ వాహనం మరమ్మతులకు గురికావడంతో గ్రామంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం దగ్గర ఈ బండిని వదిలేశారు. - సారవకోట

● తనిఖీలు



సారవకోట మండలంలోని బుడితి గ్రామంలో గల పలు పాన్‌షాపులు, భోజన హోటళ్లల్లో ఎస్ఐ అనిల్ కుమార్ తనిఖీలు చేపట్టారు. మద్యం విక్రయాలపై ఆరా తీశారు. మద్యం అక్రమంగా నిల్వ చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. భోజన హోటళ్లల్లో పరిశుభ్రత పాటించాలని సూచించారు. - సారవకోట

● కుంకుమార్చనలు



నరసన్నపేట ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా ఉన్న కార్ స్టాండ్ వద్ద శరన్నవరాత్రి ఉత్సవాలు సందడిగా జరుగుతున్నాయి. ఆదివారం మహిళలు కుంకుమ పూజలు నిర్వహించారు. సత్యవరాగ్రహారం గ్రామానికి చెందిన రుత్వికులు మావుడూరి జగదీష్ బాబు ఆధ్వర్యంలో పూజలు చేయించారు. భవానీ భక్తులు పాల్గొన్నారు. - నరసన్నపేట

పంట పండింది



లక్ష్మీనర్సుపేట వద్ద కోతకు సిద్ధంగా ఉన్న స్వల్పకాలిక వరి పంట

- నియోజకవర్గంలో రెండు వేల ఎకరాల్లో స్వలకాలిక వరి సాగు
- మరో ఐదు రోజుల్లో కోతలు ప్రారంభం
- దిగుబడులపైనే రైతన్నల ఆశలు

ఎల్.ఎన్.పేట: స్వల్పకాలిక వరి రకం పంట పండింది. మరో ఐదు రోజుల్లో కోత కోసేందుకు రైతులు సిద్ధం అవుతున్నారు. స్వల్ప కాలిక వరి కోతలు పూర్తయితే అదే పొలాన్ని దుక్కి చేసి వాణిజ్య పంటను వేసుకుంటారు. పాతపట్నం నియోజకవర్గంలోని వంశధార, మహేంద్రతనయ నదీ తీర గ్రామాలతోపాటు సమీప గ్రామాల్లో స్వల్పకాలిక వరిసాగు చేపట్టారు. ఈ ఏడాది వరి పంట వేసుకున్నప్పటి నుంచి వాతావరణ పరిస్థితులు, వర్షాలు అనుకూలించడంతో పంటలు బాగున్నాయి.

నదీ తీరంలో సాగు..

పాతపట్నం నియోజకర్గంలోని వంశధార, మహేంద్రతనయ నదీతీర గ్రామాల్లో స్వల్పకాలిక వరి సాగు చేస్తున్నారు. ఈ రెండు నదుల చెంతన మెళియాపుట్టి, పాతపట్నం, హిరమండలం, కొత్తూరు, ఎల్.ఎన్.పేట మండలాలున్నాయి. తీర గ్రామాలకు చెందిన రైతులు ప్రతీ ఏడాది స్వల్ప కాలిక వరి పండిస్తారు. ఈ ఏడాది సుమారు రెండు ఎకరాల్లో స్వల్ప కాలిక వరి పండించారని వ్యవసాయ అధికారులు లెక్కలు చెబుతున్నారు. మే ఆఖరు, జూన్ మొదటి వారంలో కురిసిన వర్షాలకు స్వల్ప కాలిక వరి విత్తనాలు ఎద జల్లే పద్ధతిలో వేసుకుంటారు. విత్తనాలు వేసిన 90 నుంచి 120 రోజుల మధ్యలో పంట కోత దశకు వస్తోంది.

వాణిజ్య పంటల సాగు..

స్వల్పకాలిక వరి కోత కోసిన తరువాత ఆయా పొలాల్లో వాణిజ్య పంటలను సాగు చేస్తారు. వాణిజ్య పంటల్లో ప్రధానమైన వేరుశనగ, హైబ్రీడ్ పెసర, నువ్వు, మొక్కజొన్న, మిరప, ఉలవ, సారి కంద, కర్బూజా తదితర వాణిజ్య పంటలను సాగు చేస్తారు. వాణిజ్య పంటలకు తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడులు సాధిస్తున్నన్నారు.

పాతపట్నం నియోజకవర్గంలో స్వల్పకాలిక వరిసాగు విస్తీర్ణం ఇలా

మండలం	సాగు విస్తీర్ణం ఎకరాల్లో	సాగుచేస్తున్న రైతులు
ఎల్.ఎన్.పేట	500	180
హిరమండలం	350	125
కొత్తూరు	380	210
పాతపట్నం	360	150
మెళియాపుట్టి	350	190

ఆశాజనకంగా స్వల్పకాలిక వరి



ఈ ఏడాది స్వల్పకాలిక వరి విత్తనాలు వేసుకున్నప్పటి నుంచి వర్షాలు, వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉండటంతో పంట ఆశాజనకంగా ఉంది. రైతుల కష్టానికి తగిన ఫలితం లభించేలా దిగుబడులు వస్తాయి. మరో రెండు, మూడు రోజుల్లో కోతలు ప్రారంభమవుతాయి. వకి కోత పూర్తయిన తరువాత ఆదే పొలంలో వాణిజ్య పంటలు వేసుకునేందుకు పొలాన్ని సిద్ధం చేస్తారు. స్వల్పకాలిక వరి కోతలు, వాణిజ్య పంటలపై రైతులకు సూచనలు చేస్తున్నాం.

– పైడి లతశ్రీ, ఏఓ, ఎల్.ఎన్.పేట

లలితా త్రిపుర సుందరీదేవిగా నీలమణిదుర్గమ్మ



ఎల్.ఎన్.పేట: లలితా త్రిపుర సుందరీదేవి అలంకరణలో దుర్గాదేవి



జలుమూరు: పూజలు అందుకుంటున్న వారాహి అమ్మవారు

పాతపట్నం: స్థానిక నీలమణిదుర్గ అమ్మవారి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నాల్గో రోజు ఆదివారం లలితా త్రిపుర సుందరీదేవిగా పూజలు అందుకున్నారు. ఉదయం నుంచి దర్శనం కోసం భక్తులు క్యూ కట్టారు. ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఈఓ వాసుదేవరావు అన్ని ఏర్పాట్లు చేశారు.

శ్యామలాపురంలో..

ఎల్.ఎన్.పేట: దసరా నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా మండలంలోని శ్యామలాపురం గ్రామంలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి ఆదివారం లలితా త్రిపుర సుందరీదేవిగా దర్శనమిచ్చి భక్తుల నుంచి పూజలు అందుకున్నారు. అమ్మవారికి మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కమిటీ సభ్యులు ఎల్.రాము, సూర్య, మిన్నారావు, గిరి, నాయుడు, యువత పాల్గొన్నారు. గ్రామ పురోహితులు ఇప్పిలి వేణుగోపాల శర్మ ఆధ్వర్యంలో ప్రతీ రోజు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

దన్నానపేటలో..

ఆమదాలవలస: మండలంలోని దన్నానపేట గ్రామంలో దుర్గాదేవి నవరాత్రులు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పరిసర గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

పెద్దకోరాడలో..

హిరమండలం: దసరా శరన్నవరాత్రి పూజల్లో భాగంగా పెద్దకోరాడలో గల పాతపట్నం నీలమణి దుర్గ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నీలమణి దుర్గ అమ్మవారు భక్తులకు లలితాత్రిపుర సుందరీదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు దివాకర్ పండా మహిళలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అన్నపూర్ణదేవిగా వారాహి అమ్మవారు

జలుమూరు: శరన్నవరాత్రులలో భాగంగా నాలుగో రోజు ఆదివారం శ్రీముఖలింగంలోని వారాహి అమ్మవారు అన్నపూర్ణదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.



ఆమదాలవలస: దనపేటలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి విగ్రహం



హిరమండలం: లలితాత్రిపుర సుందరీగా భక్తులకు దర్శమిచ్చిన నీలమణిదుర్గమ్మ

జంగిల్ క్లియరెన్స్ చేయండి



గులుమూరు వెళ్లే రహదారికి ఇరువైపులా ఉన్న పొదలు



పాతహిరమండలంలోని ఏబీ రహదారి వద్ద ఉన్న కంప చెట్లు

హిరమండలం: మండలంలోని పాతహిరమండలం అలికాం-బత్తిలి ప్రధాన రహదారిలోని వంశధార కుడి ప్రధాన కాలువ వంతెన మీదుగా నిత్యం వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ వంతెనపై ఇరువైపులా కంపచెట్లు, పొదలు పేరిగిపోయాయి. నొగూడ-కొండరాగోలు మధ్య ఏబీ రహదారికి ఇరువైపులా, బ్యారేజీ నుంచి గులుమూరు వెళ్లే రహదారిలో ఇరువైపులా పిచ్చిమొక్కలు, పొదలు ఎక్కువగా ఉండటంతో వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఎదురుగా వచ్చే వాహనాలు కనబడకపోవడంతో ప్రమాదాల బారిన పడుతున్నారు. కంపచెట్లను తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు.

నేడు, రేపు శిక్షణ

పాతపట్నం: స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మండలంలోని 34 గ్రామ పంచాయతీలకు చెందిన ఉప సర్పంచ్‌లకు, ఒక్కో గ్రామ పంచాయతీ నుంచి ఇద్దరు వార్డు మెంబర్లకు ఈ నెల 7, 8 తేదీల్లో శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ పి.చంద్రకుమారి ఆదివానం తెలిపారు. ఉదయం పది గంటల నుంచి శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయన్నారు. గ్రామ పంచాయతీల విధులు, బాధ్యతలు, గ్రామాభివృద్ధిపై శిక్షణ ఇస్తామన్నారు. గ్రామ పంచాయతీలకు కార్యదర్శుల ద్వారా సమాచారం అందించామన్నారు. శిక్షణ తరగుతులకు విధిగా హాజరుకావాలని కోరారు.

గిరిజన హక్కులపై అవగాహన

మెళియాపుట్టి: గిరిజనులు వారి హక్కలను తెలుసుకోవాలని కొత్తూరు వెలుగు అసోసియేషన్ సభ్యులు అన్నారు. ఆదివారం మండలంలోని కేరాశింగి పంచాయతీ పరిధిలోని గొడ్డ గ్రామంలో గిరిజన హక్కులపై అవగాహన కల్పించారు. పొగడవెల్లి, వీరన్నపేట, ముత్యాలబొంతు, రింపి గ్రామాల ప్రజలకు పోడు పట్టాలు పొందడం, అటవీ హక్కుల గూర్చి తెలియజేశారు. పలు హక్కల కోసం దరఖాస్తులు ఎలా చేసుకోవాలో వివరించారు. అసోసియేషన్ సభ్యులు జగన్, చంద్రరావు, గిరిజనులు పాల్గొన్నారు.

యువతకు శిక్షణ

సారవకోట: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆర్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో యువకులకు యోగా, తదితర అంశాలపై ఆదివారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్రీయ స్వయం సేవక సంఘ్ టెక్కలి డివిజన్ పరిధిలో శిక్షణను మూడు రోజులపాటు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి 10 మండలాల నుంచి శిక్షణార్థులకు యోగా, సూర్యనమస్కారాలు, దండ ప్రయోగాలు వంటి శారీరక అంశాలతోపాటు దేశ చరిత్ర, దేశ నాయకుల గాథలు, దేశభక్తి గీతాలు, బౌద్ధిక అంశాలు నేర్పించారు.



శిక్షణ పొందుతున్న యువకులు

● చీరలే రక్షణ



సారవకోట మండలంలోని తొగిరి గ్రామంలో క్యాబేజి నారు రక్షణ కోసం రైతులు చీరలను వినియోగిస్తున్నారు. ఈ గ్రామానికి సమీపంలో బక్కిరికొండ ఉండటంతో అటవీ జంతువుల నుంచి క్యాబేజి నార రక్షణకు రైతులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. - సారవకోట

● భారీ వాహనాలతో ఇక్కట్లు



ఈ చిత్రం ఆదివారం మెళియాపుట్టి మూడు రోడ్ల కూడలిలో కనిపించింది. భారీ గ్రానైట్ రాళ్లతో పరిమితికి మించిన బరువుతో వాహనాలు వెళ్తూ ఉండటంతో వాహనదారులు, ప్రజలు రాకపోకలు సాగించడానికి తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఊక ట్రాక్టర్ల తీరు ఇంతే. లోడింగ్ విషయంలో విక్రయదారులు ఏమాత్రం వెనక్కి తగ్గడంలేదు. కరెంటుతీగలున్నా.. ఇరుకు వీధులైనా ఎటువంటి జాగ్రత్తలు పాటించకుండా రవాణా కొనసాగిస్తున్నారు. రాత్రి పది గంటలు దాటితే చాలు విచ్చలవిడిగా భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తునానయి. సంబంధిత అధికారులు ఇటువంటి వాహనాలపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. - మెళియాపుట్టి

దరఖాస్తుల ఆహ్వానం

పాతపట్నం: స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో 2024-25 సంవత్సరానికి మిషన్ వాత్సల్య పథకం స్పాన్సర్‌షిప్ మంజూరుకు అర్హులైన బాలల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నామని సీడీపీఓ టి.విమలరాణి ఆదివారం తెలిపారు. నిరుపేద, నిస్సహాయ స్థితిలో ఉన్న పిల్లలకు వైద్య, విద్య కోసం నెలకు రూ.4 వేల చొప్పున అదనపు ఆర్థిక సహాయం అందించేందుకు అర్హులైన బాలలు దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకునే వారు 2025 సంవత్సరం మార్చి 31 నాటికి 18 ఏళ్ల లోపు ఉండాలని, తల్లిదండ్రులు కోల్పోయి వారు, ఇతర కుటుంబంలో నివసిస్తున్న అనాథ పిల్లలు, తల్లిదండ్రులు ఇరువురు క్యాన్సర్, డయాలసిస్ వంటి ప్రాణాంతకర వ్యాధిగ్రస్తులైన వారి పిల్లలు, హెచ్‌ఐవీ వ్యాధి బారినపడిన తల్లిదండ్రుల పిల్లలు, ఎన్టీఆర్ వైద్య (ఆరోగ్య శ్రీ) సేవ, ఇతర ప్రభుత్వ పథకాలు లబ్ధిపొందని, హెచ్‌ఐవీ, క్యాన్సర్, తలసీమియా, సికెల్ సెల్ తదితర వ్యాధిగ్రస్తుల పిల్లలు, బాలల న్యాయ (రక్షణ, ఆధరణ) చట్టం-2015 ప్రకారం సంరక్షణ, ఆదరణ అవసరమైన పిల్లలు, పైకేటగిరిల్లో లేని ప్రభుత్వ పాఠశాల, కళాశాలలో చదువుతున్న పిల్లలకు ప్రాధాన్యత ఉంటుందన్నారు. బాల్య వివాహాల నిర్మూలన కోసం పైకేటగిరిలోని 15 నుంచి 18 ఏళ్ల వయస్సు బాలికలకు ప్రాధాన్యత, కుటుంబ వార్షిక ఆదాయం, గ్రామీణ ప్రాంతాల వారికి రూ.72 వేలు, పట్టణ ప్రాంతాల వారికి రూ.96 వేలు మించి ఉండకూడదన్నారు. ఈ నెల 22 తేదీ లోగా దరఖాస్తులు చేసుకోవాలని పీఓ తెలిపారు.

అపూర్వ కలయిక

హిరమండలం: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1992-1997 వరకు చదివిన విద్యార్థులు ఆదివారం శ్రీకాకుళం ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఒకరి కష్టసుఖాలు మరొకరు తెలుసుకున్నారు.



హిరమండలం: 1992-97 బ్యాచ్ విద్యార్థులు



కొత్తూరు: 1997-98 బ్యాచ్ విద్యార్థులు

జ్ఞాపకాల బడిలో..

కొత్తూరు: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1997-98లో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం వారు చదువుకున్న పాఠశాలలో కలిశారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఆనాటి ఉపాధ్యాయుడు ప్రస్తుతం ఇదే పాఠశాల హెచ్ఎం గోవిందరావును ముఖ్య అతిథిగా ఆహ్వానించి సత్కరించారు. చదువుకున్న పాఠశాలకు సుమారు రూ.20 వేలు చేసిన సౌండ్ సిస్టమ్ అందజేశారు. ముగితి లక్ష్మణరావు, ఐ.శంకరరావు, మల్లా శ్రీకాంత్, రాము, కవిత, శివ, నిర్మల తదితరులు పాల్గొన్నారు.